## పలమనేరు ప్రజలందరి సహకారంతో ఆర్.టీ.సి డిపోను లాభాలబాట పట్టిస్తాం

-ఎమ్మెల్యే చొరవతో రానున్న సర్వీసులు

- డిపో మేనేజర్ టి.కె.స్వామి స్పష్టం

-4లో



పెన్ పవర్
రాయలసీమ
తిరుపతి । చిత్తూరు । అన్నమయ్య । వై.ఎస్.ఆర్ కడప । నంద్యాల । కర్నూలు । అనంతపురం

# "డాయ్ యాప్" ఘటనపై విచారణ కమిటీ నియామకం

## జిల్లాకలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి

**పలమనేరు జూలై 27,(పెన్ పవర్):**పలమనేరు ప్రాంతంలో "డాయ్ యాప్" పేరుతో ప్రజలను మోసం చేసిన బాధితులకు న్యాయం చేసేందుకు మెప్మా పిడి ఆధ్వర్యంలో రెవిన్యూశాఖ తరఫున డిప్యూటీ తహసీల్దార్, పోలీస్ శాఖ తరఫున పలమనేరు సిఐ తో కలిపి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

ఈవిచారణ కమిటీ ఈనెల 29,30వ తేదీలలో అనగా సోమ,మంగళ వారాలలో పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం10 గంటల నుండి కార్యాలయపు పనివేళల్లో అందుబాటులో ఉంటారని,డాయ్ యాప్ భాదితులు విచారణ కమిటీకి తమ ఫిర్యాదులను అంద జేయవచ్చునని జిల్లా కలెక్టర్ శనివారం తెలిపారు.



## శిక్ష సప్తహ్ లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం





**పలమనేరు జూలై 27,(పెన్ పవర్):**శిక్ష సప్తహ్ లో భాగంగా గంగవరం మండలంలోని పలు పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మామడుగు, జి.ఎల్.ఎస్.ఫారం మరియు పొన్నమాకుల పల్లె పాఠశాలలో నిర్వహించారు. మామడుగు ఉన్నత పాఠశాల నందు సుమారు 40రకాల మొక్కలను పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు నాటారు. అలాగే ఏక్ పెడ్ మాకే నామ్ అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని మరియు విద్యార్థుల తల్లుల సహకారంతో పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం భారీఎత్తున జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిప్రసాద్,జి. ఎల్.ఎస్.ఫారం ఉపాధ్యాయులు మల్లిచెట్ల దేవేంద్రా, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాకమిటీ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళిత మహాసభ వ్యవస్థాపకులు కత్తి పద్మారావు జయంతి వేడుకలు



**పలమనేరు జూలై 27,(పెన్ పవర్):**ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు కత్తి పద్మారావు 71వ జయంతిని పట్టణంలోని జాతీయ మానవహక్కుల కార్యాలయం నందు శనివారం చంద్రకుమార్ అధ్యక్షతన ఘనముగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డి.వి.మునిరత్నం, శివాడి గోవిందు మాట్లాడుతూ.. కత్తి పద్మారావు ఒక లెక్చరర్ గా ఉంటూ దళిత జాతి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టారని,అనేకమైన నిర్బంధాలను పట్టుకొని మొక్కవోని దీక్షతో బడుగు బలహీన మైనార్టీ వర్గాల కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. దేశంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా మొదట స్పందించి తన గళాన్ని ప్రదర్శించేవాడని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలోని కారంచేడు,చుండూరు, కొత్త పెంట ఇలా అనేకమైన ప్రాంతాల్లో జరిగిన ఊచకోత,కుల వివక్ష,గ్రామబహిష్కరణ,మహిళలు,చిన్నారులపై అత్యాచారాలు జరిగిన వాటిలో పెద్ద పోరాటాలు నిర్వహించిన ఘనుడు కత్తిపద్మారావు మాత్రమే నని ప్రశంసించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ మనమందరం ఐక్యంగా కులాలకు మతాలుకు అతీతంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మనీ, వినోద్ కుమార్, సాంబశివ, సుబ్రహ్మణ్యం, గంగిరెడ్డి,సరస్వతి, లక్ష్మమ్మ,శివన్న, శ్రీనివాసులు,వెంకటరమణ,బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆశ్రయించిన "డాయ్ యాప్" బాధితులు

-విచారణ జరపాలని మెప్మా పీడీని ఆదేశించిన ఎమ్మెల్యే

-మాయమాటలు నమ్మి మోసపోవద్దని బాధితులకు హితవు

**పలమనేరు జూలై 27,(పెన్ పవర్):**పలమనేరు పట్టణంలో గత రెండు రోజులుగా దుమారం రేగుతున్న డాయ్ యాప్ బాధితులు శనివారం సాయంత్రం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డిని స్థానిక కార్యాలయంలో కలిసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా తమకు జరిగిన మోసాన్ని ఆయనకు వివరించి పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. మెప్మా కార్యాలయంలోని డేటాఎంట్రీ ఆపరేటర్ రాజేష్ ఆధ్వర్యంలో ఆర్పీల ద్వారా ఈ తతంగమంతా నడిచిందని పేర్కొన్నారు. గత రెండు రోజులుగా తమకు జరిగిన అన్యాయంపై ఆర్పీలను అడుగుతున్నా తమపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని దీనిపై న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన మెప్మా పీడీకి ఫోన్ చేసి వెంటనే ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం ఎలా చేయాలో చూడాలని ఆదేశించారు. అవసరమైతే పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేసేందుకు నావంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక అదే విధంగా ఇప్పటికే పలుమార్లు పలమనేరులో ఇలాంటి మోసాలు జరిగాయని ఇకనైనా మాయ మాటలు నమ్మి మోసపోవద్దని బాధితులకు ఆయన హితువు పలికారు. ఈ కార్యక్రమంలో బాధితుల వెంట పలువురు తెలుగుదేశం నాయకులు ఉన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షులుగా కేసీ జయశంకర్



**పలమనేరు జూలై 27,(పెన్ పవర్):**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షులుగా మలేరియా నియంత్రణ యూనిట్ అధికారి కేసీ.జయశంకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జరిగిన ఈఉద్యోగుల సమావేశంలో నియోజకవర్గ అసోసియేట్ ప్రెసిడెంట్ గా డాక్టర్ మహమ్మద్ సెక్రటరీగా కె.వి.రమణ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ట్రెజరర్ గా ఆర్ నజీర్ ట్రెజరీ డిపార్ట్మెంట్ నుండి వైస్ ప్రెసిడెంట్ గా కేసీ జ్యోతిష్కర్ మెడికల్ డిపార్ట్మెంట్ ఎం.విద్యాసాగర్ యాంటీ ప్లే యూనిట్ పీ లాలస స్టాఫ్ నర్స్ ఎస్ నిజమా సూపర్వైజర్ ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ కే హనుమంతు విఆర్ఓ రెవిన్యూశాఖ ఎల్.కిషోర్ కుమార్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ జయప్రకాష్ మునిసిపల్ కార్యాలయము ఆర్గనైజేషన్ జి మధు కుమార్ జాయింట్ సెక్రటరీలుగా ఎస్సీ రజాక్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్, కే రాజేష్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ జాయింట్ సెక్రటరీ,కే.ఉష కుమారి రవిచంద్రన్ రిజిస్ట్రేషన్ శాఖ కే స్వామినాథన్ రెవెన్యూ శాఖ ఎంకే ఇంద్రాణి సచివాలయ శాఖ శ్రీ నీరుద్దీన్ ఉపాధ్యాయ శాఖ మహబూబ్ బాషా వైద్య ఆరోగ్య శాఖలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్ దైవ కుమార్ తెలియజేశారు. ఇది పలమనేరు ఆంటీ ప్లేగు కార్యాలయం నందు ఈరోజు 11 గంటలకు ఎలక్షన్ జరిగినట్లుగా ఎలక్షన్ ఆఫీసర్ దేవకుమార్ తెలియజేశారు. ఇందులో ఎన్నికైనా సభ్యులు మూడు సంవత్సరములు కొనసాగుతారని తెలిపారు. తాలూకాలోని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల యొక్క హక్కులు కొరకు పోరాడి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సంక్షేమానికై కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన పలమనేరు తాలూకా అధ్యక్షులు కేసి.జయశంకర్ తెలిపారు. ఇందులో ఆయన సోదరులు గంగవరం ప్రాధమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్ వైజర్ జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతవాసులకు వైద్యసేవలు అందుబాటులో ఉండాలి!

**పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పగడాల శ్రీనివాసరావు స్పష్టం**





**పలమనేరు జూలై 27,(పెన్ పవర్):**మారుమూల ప్రాంతవాసులకు కూడా వైద్యసేవలు నిత్యం అందుబాటులో ఉండాలని పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పగడాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని జెండామఠం ఏరియా సచివాలయంలో జడ్జ్ ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపేట యు.పి.హెచ్.సి. సిహెచ్ఓ మాధవి మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు వస్తున్నాయన్నారు. ఒకటి రెండుసార్లు వాంతులు విరేచనాలు అయిన వెంటనే సంబంధిత ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులతో సంప్రదించాలన్నారు. నాణ్యమైన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతుందన్నారు. అలాగే స్పర్శ లేని మచ్చలు గురించి సర్వేను చేపడుతున్నారని ఎవరికైనా స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. బిసీజీ ఇంజక్షన్లను 60 సంవత్సరాల వయస్సు పైబడిన ప్రతి ఒక్కరూ వేసుకోవాలన్నారు.

ఇది ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ తప్పక వేసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిసిజి ఇంజక్షన్ వేసుకోవడం వల్ల జ్వరం రావడం పుండు అవుతుందని ఎన్నో అపోహలను నమ్మకూడదన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు ధగ్గేటప్పుడు వారి నుండి వచ్చే తుంపర్లు ఇతరులకు సోకినప్పుడు వెంటనే వృద్ధులకు క్షయవ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందుకే బీసీజీ ఇంజక్షన్లను వేసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలలో పుట్టిన బిడ్డకు ఒక ఇంజక్షన్ ప్రధానమైనది వేయాలంటే 5వేల రూపాయలు అవుతుందని ఇలాంటివి ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రులలో నాలుగు ఇంజక్షన్లు పుట్టిన బిడ్డకు వేయాల్సి ఉంటుందన్నారు. కళ్లకు సంబంధించిన వ్యాధులు ఉంటే ఆధార్ కార్డు వారి వెంట తెచ్చుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంట్రీ వేసుకోవాలన్నారు.

తథనంతరం పరీక్షలు చేపట్టి శస్త్రచికిత్స చేయాలంటే ఉచితంగా మందులను పంపిణీ చేసి శస్త్రచికిత్సలు చేపడతామన్నారు. కావున ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యాన్ని రోగులకు అందిస్తున్నామని తెలిపారు. పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ ఆదేశాల మేరకు వృద్ధులకు చర్మవ్యాధి పరీక్షలు చేపట్టి మందులను ఉచితంగా అందజేసామని వైద్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో పాతపేట యూపీహెచ్సి చర్మవ్యాధుల వైద్యురాలు ఆశా, గొబ్బిళ్ళకోటూరు హెల్త్ సెంటర్ ఏఎన్ఎం కృష్ణవేణి,ఆశ వసంత. జెండామఠం సచివాలయ అడ్మిన్ భార్గవి,న్యాయవాదులు మరియు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 31 న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్స్

**అనపర్తి,పెన్ పవర్,జూలై 27.** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనపర్తి లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి ఈనెల 31న ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ. వి. విజయ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాయకపోయినా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. స్పాట్ అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు పదో తరగతి మార్కులు జాబితా, ట్రాన్స్ఫర్ సర్టిఫికేట్, నాలుగు నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం రెండు ఫోటోలు ఆధార్ కార్డు ఒరిజినల్ తో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలి. స్పాట్ అడ్మిషన్ కోసం 5,800 ఫీజు చెల్లించాలి. స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ వర్తించదు.

## అమ్మ కు ప్రేమతో ఒక మొక్క నాటుదాం...



**రావులపాలెం పెన్ పవర్ జూలై 27:** అమ్మకు ప్రేమ తో ఒక మొక్క నాటుదాం అంటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎమ్.కమల కుమారి అన్నారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటాలని స్కూల్ ఆవరణంలో ఆఫీసుల వద్ద అమ్మ పేరుతో ఓ మొక్కను నాటి అమ్మ మీద ప్రేమను చూపుకోవాలని పిలుపునివ్వడంతో శనివారం రావులపాలెం శ్రీ వాగ్దేవి విద్యాలయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ వల్లి భాష,విద్యార్థిని తల్లి పేరుతో ఓ మొక్కలు నాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,
మన జీవితంలో అమ్మ తర్వాతే కాబట్టి అమ్మ నవమాసాలు పెంచిన అమ్మకు గౌరవిస్తూ ఆమె గుర్తుగా ప్రతి ఒక వ్యక్తి మొక్కలను నాటాలని అన్నారు. అమ్మ మనల్ని చిన్నతనం నుండిఎలా పెంచి పెద్ద చేసిందో అదే విధంగా నాటిన మొక్కను కూడా సంరక్షించి పెద్దగా చేసే వరకు కాపాడి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యలు కావాలన్నారు. ప్రతి విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

## పాఠశాలను పర్యవేక్షించిన జిల్లా విద్యాశాఖ అధికారి



**కుక్కునూరు,పెన్ పవర్,జులై 27 :**కుక్కునూరు మండలంలో మంత్రులు పర్యటనలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం కుక్కునూరు వచ్చారు.ఈ పర్యటనలో బెస్త గూడెం పాఠశాల పర్యవేక్షణ చేశారు.పిల్లలు యొక్క విద్యా బోధనపై అన్ని తరగతులను గదులను తిరిగి పరిశీలించారు.ప్రభుత్వం ఇచ్చే విద్యార్థి కిట్టు అందరికీ ఇచ్చారా అని వివరాలు అడిగారు.వర్షాకాలం,వరదలు కారణంగా పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు రాధ కు సూచించారు.విద్యార్థులు మంచి విద్యా బోధన అందించాలని పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గిరి భగవాన్ దాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 9వ వర్ధంతి



**వై రామవరం,పెన్ పవర్, జూలై 27 :** మండలంలోని గిరిజన గురుకుల జూనియర్ బాలికల కళాశాల నందు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం తొమ్మిదో వర్ధంతిని ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు.

పి.ఎర్రగొండ లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు )లో భారతరత్న,మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అబ్దుల్ కలాం ఆవిష్కరణలు,సేవలు,రచనలు, నిరాడంబరమైన జీవితాన్ని గురించి విద్యార్థినులకు వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పలమనేరు ప్రజలందరి సహకారంతో ఆర్.టీ.సి డిపోను లాభాలబాట పట్టిస్తాం

**పలమనేరు జూలై 27,(పెన్ పవర్):** పలమనేరు ప్రజలందరి సహకారంతో ఆర్.టీ.సి డిపోను లాభాలబాట పట్టిస్తామని డిపో మేనేజర్ టి.కె.స్వామి స్పష్టం చేశారు. శనివారం ఆర్టీసీ డిపోనందు ఆయన ఛాంబర్ నందు మాట్లాడుతూ.. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే లాభాలలో రికార్డు సృష్టించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు.
పలమనేరులో ప్రస్తుతం 39పల్లెవెలుగు,4 ఎక్స్ప్రెస్ సర్వీసు బస్సులు ఉన్నాయని, వాటి ద్వారా డిపోకు నిర్దేశించిన టార్గెట్ ప్రకారం ప్రతిరోజూ డిపో ఆదాయం 7లక్షల రూపాయలు చేయాల్సి ఉండగా,అది 6లక్షల 40వేల రూపాయలు మాత్రమే జరుగుతోందని అన్నారు.ఈ ప్రకారం ప్రతినెలా దాదాపు కోటిన్నర పైన డిపోకు నష్టం జరుగుతోందని వివరించారు. కరోనా వచ్చినప్పుడు ప్రజలు బస్సు ప్రయాణానికి దూరం కావడంతో ఆర్టీసీ ఆదాయం కోల్పోయిందని,అలాగే గతంలో ఇక్కడి కొన్ని బస్సులు ప్రక్కన డిపోలకు తీసుకుని వెళ్లిపోవడం కూడా ఒక కారణమని అన్నారు.

**ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చొరవతో రానున్న సర్వీసులు**

జూన్ నెలలో కొత్త ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించి,గతంలో వెళ్లిపోయిన బస్సులను తిరిగి తీసుకుని రావడానికి తగిన సూచనలు చేశారు.అలాగే వాటిని తీసుకుని రావడమే కాకుండా కొత్తగా పలమనేరు నుండీ బెంగళూరు, విజయవాడ,కోలార్, అనంతపురం,హైదరాబాద్ తదితర ప్రాంతాలకు సర్వీసులు నడిపేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి విజయవాడ కేంద్రం డిపోకు పంపాలన్నారు. ఈ ప్రయత్నంలో వాటిని సాధించుకోవడానికి ప్రభుత్వంలోని అన్ని అనుమతుల మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే కృషికి డిపో మేనేజర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాబట్టి రానున్న రోజుల్లో ఆర్టీసీ డిపోను మరింతగా అభివృద్ధి బాటలో నడిపేందుకు ఎమ్మెల్యేతో బాటు,డిపో పరిధిలోని డ్రైవర్లు, కండక్టర్లు మరియు ఇతర సిబ్బందితో బాటు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా...

### ఎమ్మెల్యే నల్లమిల్లి...

**అనపర్తి,పెన్ పవర్,జూలై 27.**గత ప్రభుత్వం పుణ్యమాంటూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతుందని దాని కారణంగా పెన్షనర్ల ఇబ్బందులను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికేతర సమస్యలను ముందు వరుసలో పరిష్కరిస్తామని ఆర్థికంతో కూడిన సమస్యలను తదనంతరం పరిష్కారాన్ని కృషి చేస్తానని చెప్పారు. పెన్షనర్ అసోసియేషన్ యూనిట్ అధ్యక్షులు పీవీఎన్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెన్షనర్స్



అందరూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని పూలమాలలు దుశ్శాలువాలతో ఉచిత రీతిని సత్కరించారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిలువ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్




**వై రామవరం, పెన్ పవర్, జూలై 27 :** ప్రత్యేక శానిటేషన్ లో భాగంగా గ్రామాలలో నిలవ ఉన్న నీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయించడం జరిగిందని ఎంపీడీవో బాపన్న దొర తెలిపారు.

మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శానిటేషన్ మూడవ రోజున నీటి నిల్వల గుంతలు, డ్రైన్లలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది,హెల్త్ సిబ్బంది, క్లాత్ మిత్రలు పాల్గొన్నారు అని తెలిపారు.

## ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవం

**గండేపల్లి, పెన్ పవర్, జూలై 27 :** ఆయిల్ ఫామ్ తోటల విస్తరణ మహోత్సవంలో భాగంగా గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీఎం ఏఎస్ ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట యొక్క ప్రాముఖ్యత,ప్రత్యేకతలు గురించి వివరించారు. గండేపల్లి మండలంలో 5,334 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ తోటలను సాగుచేస్తున్నారని రైతులకు వివరించారు. ఆయిల్ ఫామ్ సాగుకు అవసరమైన ఎరువులు అంతర పంటలు బిందు సేద్యం సంబంధిత పనిముట్లు విషయంలో ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకాలు, రాయితీలు, కంపెనీవారు కల్పించే సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు సతిరాజు,పయిన్ని వెంకటేశ్వరరావు,గెడ్డం అమ్మిరాజు,పాలచర్ల సత్యనారాయణ ల చేతుల మీదుగా కొత్తగా పామాయిల్ వేసుకునే రైతులు నక్క సత్యనారాయణ, కందుల సత్యనారాయణ,జి రాంబాబు లకు



మొక్కలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పతాంజలి కంపెనీ సిబ్బంది ఎస్ వీర్రాజు, జి దుర్గాప్రసాద్ ,గణేష్, మణికుమార్ ,ప్రసాద్, కొండలరావు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పృథ్వి,హరిష,భాగ్యరేఖ,సురేఖ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య సివిల్ విభాగంలో ముగిసిన నైపుణ్యాభివృద్ధి సదస్సు



**గండేపల్లి, పెన్ పవర్, జూలై 27 :** సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నందు సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి సదస్సు శనివారంతో ముగిసింది. ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్ తో కలిసి నిర్వహించిన ఐదు రోజుల " టెక్నికల్ ట్రైనింగ్ ఆన్ ఆటోకాడ్ ఫర్ టెక్నిషన్స్ " కు సాంకేతిక సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సదస్సుకు డా.జ్ఞానానందరావు నేతృత్వంలో డా. నాగ ధీరాజ్కుమార్ రెడ్డి, డా. అజయ్ కుమార్, కుమారి సరస్వతి మరియు శ్రీ జార్జ్ ఫెర్నాడజ్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ముగింపు సమావేశంలో ప్రిన్సిపాల్ డా.ఆదిరెడ్డి రమేష్ గారు మాట్లాడుతూ పార్టిసిపెంట్స్ ను తమ తమ విభాగాల్లో స్కిల్స్ ను పెంపొందించడానికి ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగపడతాయి అని వివరించారు. ఈ సందర్భంగా డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వైకేఎస్ సుబ్బారావు గారు మాట్లాడుతూ "ఆటోక్యాడ్" సాంకేతిక నిపుణులకు వివరణాత్మక మరియు ఖచ్చితమైన సాంకేతిక డ్రాయింగ్‌లను రూపొందించడానికి ఉపయోగపడుతుంది అని సూచించారు. డీన్ అడ్మిన్ డా. సుబ్బారావు గారు, డీన్ ఐక్యూఏసి డా. జి సంజీవ్ రావు గారు మరియు సివిల్ ఇంజనీరింగ్ విభాగాదిపతి శ్రీ నాగ సాయి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా తరగతులు టెక్నీషియన్స్ కు అత్యవసరం అని తెలియజేశారు మరియు పార్టిసిపెంట్స్ కు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందచేశారు.

## ప్రతి విద్యార్థి అమ్మపేరుతో ఒకమొక్కను పెంచాలి

**కరప, పెన్ పవర్, జూలై 27:** పాఠశాల స్థాయినుంచి ప్రతి విద్యార్థి అమ్మపేరుతో ఒక మొక్కను నాటి పెంచాలని సర్వశిక్షాభయాన్ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు శనివారం కరప మండలం నడకుదురు మండల ప్రజాపరిషత్ ప్రాథమికపాఠశాల-1లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పాఠశాలల్లో ఏకో క్లబ్ ఏర్పాటుచేసి నీరు, నీటివ్యవస్థ, శక్తి, భూమి, గాలి, ఆహారం అనే ఆరుఅంశాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిదండ్రులకు, విద్యార్థులకు వాటి అవసరం, పరిరక్షించుకోవడంపై హెచ్ఎం వాకాడ వెంకటరమణ, కె. విజయలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కల్సి పాఠశాల ఆవరణలో సీఎంఓ నాగేశర్వరరావు మొక్కలను నాటారు. గురజనాపల్లి హైస్కూలులో హెచ్ఎం సాయిమోహన్ ఉపాధ్యాయులతో కల్సి ఏకోక్లబ్ ను ఏర్పాటుచేశారు. శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం సాయిమోహన్కు ఉపాధ్యాయులు ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి, ఎన్.నాగలింగేశ్వరరావు తదితరులకు విద్యార్థులు మొక్కలను అందజేయగా, పాఠశాల ఆవరణలో నాటారు.



## ఆగస్ట్ పెన్షన్ డీటెయిల్స్ అందుకున్న ఎంపీడీవోలు



**వై రామవరం,పెన్ పవర్,జూలై 27 :** ఆగస్టు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కు సంబంధించిన డీటెయిల్స్ ప్రభుత్వం నుండి అందాయని వై రామవరం ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

మండలంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో 1783 పింఛన్దారులకు 70,79,000 రూపాయలు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 1554 మంది పింఛన్లకు 63,46,500 రూపాయలు విడుదలయ్యాయి అన్నారు.ఆగస్టు నెల పింఛన్లను ఒకటవ తేదీన 99 శాతం పింఛన్లు పంపిణీ జరగాలని, సాంకేతిక కారణాలు ఏర్పడినప్పుడు రెండవ తేదీన మొత్తం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. మొదటి రెండవ రోజు పెన్షన్లు పంపిణీ కార్యక్రమం అన్ని గ్రామాలలో ప్రెస్,సోషల్ మీడియా,బీట్ అఫ్ టామ్ టామ్,బహిరంగ ప్రదేశాలలో ఆడియో రికార్డింగ్ ప్లే చేయడం, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, ప్రతి పింఛనుదారునికి ఈ సమాచారం అందాలన్నారు. 90 కంటే ఎక్కువ మంది పింఛన్దారులు ఒక సిబ్బందికి ఉంటే, రీ మ్యాపింగ్ ప్రక్రియ శనివారానికి పూర్తి చేయాలన్నారు. బ్యాంకుల నుండి ఈ నెల 31వ తేదీన నగదు తీసుకొని, ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుండి పంపిణీని ప్రారంభించాలన్నారు. రెండవ తేదీన పంపిణీ పూర్తయిన తర్వాత మిగిలిన సొమ్మును సెర్ప్ ఖాతాకు జమ చేయాలన్నారు.

## అబ్దుల్ కలాంకు ఘనంగా నివాళు లర్పించిన విద్యా బాల మందిర్



**కొత్తపేట, పెన్ పవర్ జూలై27 :**
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ లో శనివారం ఏ.పి.జే అబ్దుల్ కలాం 9 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్ అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ మహామనిషి, నిస్వార్థపరుడు , ఇండియా మిస్సైల్ మెన్, అణుశాస్త్ర పితామహుడు గా ఎన్నో కీర్తిప్రతిష్టలు సంపాదించిన వ్యక్తి అబ్దుల్ కలాం. ఈయన తమిళనాడు రాష్ట్రంలో రామేశ్వరం లో అక్టోబర్ 15 వ తేదీ 1931 లో జన్మించారు.భారతరక్షణ రంగానికి సేవ చేసారు.భారత రాష్ట్రపతి గా సేవ చేసారు.భారతరత్న, పద్మవిభూషణ్ బిరుదులు వరించాయి. " కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి " అని గొప్ప సందేశం విద్యార్థులకు అందించారు. ఈకార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.